సాక్షి
విజయనగరం
గురువారం । 10 । ఆగస్టు । 2023



సౌకర్యాల వెం'బడి చదువులు'

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది. - 8లో



ఘనంగా గిరిజన యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం

ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ 5వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. - 8లో



నాణ్యతలో తేడాలొస్తే కఠిన చర్యలు

మధ్యాహ్న భోజనాల నాణ్యతలో తేడాలొస్తే కఠిన చర్యలు తప్పవని స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు హెచ్చరించారు. - 8లో

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి డీఎఫ్‌ఓగా ప్రసూన

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా అటవీశాఖాధికారి ఎస్.వెంకటేష్ వైల్డ్ లైఫ్‌కు సంబంధించిన శిక్షణ కోసం ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌కి వెళ్లారు. ఈ మేరకు పార్వతీపురం మన్యం జిల్లా డీఎఫ్‌ఓ జీఏపీ ప్రసూనకు విజయనగరం ఇన్‌చార్జి డీఎఫ్‌ఓగా అదనపుబాధ్యతలు అప్పగించారు. సెప్టెంబర్ 17వరకు ఆమె విధులు నిర్వర్తించనున్నారు.

'జగనన్న గోరుముద్ద' బాగుంది



విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్‌కమిషన్ సభ్యులు

బొబ్బిలి: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జి.దేవి, ఇ.లక్ష్మీనాయుడు బొబ్బిలి మండలం పారాది జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన విధానం, మెనూ అమలు తీరును స్వయంగా పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. జగనన్న గోరుముద్ద బాగుందని, రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారని విద్యార్థులు తెలపడంతో సంతృప్తి చెందారు. అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఎస్టీ బాలికల వసతిగృహాన్ని, కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించారు. ఎస్టీ విద్యార్థినులతో మమేకమయ్యారు. బాలికలు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను కూడా చైర్మన్ దృష్టికి తీసుకెళ్తామని సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు, సీఎస్ డీటీ ఆర్.సాయికృష్ణ, సీడీపీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన షూటింగ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: నెల్లూరు జిల్లాలో ఈ నెల 12,13 తేదీల్లో జరగబోయే రాష్ట్ర స్థాయి జూనియర్ షూటింగ్‌బాల్ పోటీలకు ఎల్.కోట మండలం చందులూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపిక పోటీలు బుధవారంతో ముగిశాయి. పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు తలపడ్డారు. వీరిలో డి.సతీష్, డి.కృష్ణంనాయుడు, కార్తిక్, చందు, రాము, పండు, సిద్ధు, వాసు, మనోజ్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు షూటింగ్‌బాస్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి పులిబంటి ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో చందులూరు హైస్కూల్ హెచ్‌ఎం బి.వి.గోవిందరాజు, పీడీలు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రుల పరిధిలో ఖాళీగా ఉన్న ఆడియోమెట్రిసిన్ పోస్టులు 02, థియేటర్ అసిస్టెంట్స్ పోస్టులు-02కు సంబంధించి ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ బి.గౌరీశంకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే 16వ తేదీ సాయింత్రం 5 గంటలలోగా డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి



సెంచూరియన్‌లో విద్యార్థులతో కలిసి కాఫీ కనెక్ట్‌ను ప్రారంభిస్తున్న వీసీ మహంతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ క్యాంపస్‌లో సెంచూరియన్ కాఫీ కనెక్ట్ షాపును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్సిటీలో బీబీఏ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కాఫీ కనెక్ట్ షాపును నిర్వహిస్తారన్నారు. విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.

కొండగుడిలో ఆదివాసీ సంబరం

- సాలూరులో అంగరంగ వైభవంగా రాష్ట్రస్థాయి ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- సంబరాల్లో మమేకమైన వేలాదిమంది ఆదివాసీలు
- గిరిజనుల సంక్షేమానికి జగనన్న కృషి: డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనాభివృద్ధి: జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



గిరిజన నృత్యాలతో ప్రజాప్రతినిధులకు స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు



గిరిజన బాలికలతో కలిసి థింసా నృత్యం చేస్తున్న డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: డప్పువాయిద్యాలు.. థింసా నృత్యాలు.. కొమ్ము, బిందెల డ్యాన్స్‌లు.. విచిత్ర వేషధారణలతో ఆదివాసీలు మురిపించి మైమరిపించారు. వేషభాషలతో ఆకట్టుకున్నారు. ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలిచ్చారు. ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర అధ్యక్షతన, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఆధ్వర్యంలో సాలూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్రస్థాయిలో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. కార్యక్రమానికి హాజరైన పీడిక రాజన్నదొరతో పాటు జిల్లా ఇన్‌చార్జి, ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి తదితరులకు ఆదివాసీలు ఘన స్వాగతం పలికారు. సభాస్థలి వద్ద ముందుగా ఆదివాసీ జెండాను ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, కొమరంభీం తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముందుగా ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మాట్లాడుతూ, గిరిజన సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 38,363 మంది గిరిజన రైతులకు 89,027 ఎకరాల పోడుపట్టాలను అందించినట్టు వెల్లడించారు. అర్హులైన గిరిజన రైతులందరికీ వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ. 13,500 పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందజేస్తోందన్నారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు.

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ, ఆదివాసీయుల ఆచారసంప్రదాయాలు, గొప్పతనం ప్రపంచానికి తెలియజేయడమే ఉత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్రస్థాయి ఉత్సవాలు సాలూరులో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి, నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిల పాలనలోనే గిరిజనులకు మేలు జరిగిందన్నారు. గిరిజనులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో పాటు రాజ్యాంగపరమైన గిరిజన చట్టాలు పరిరక్షింపబడుతున్నాయని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. టీడీపీ పాలనలో గిరిజనులకు అన్ని విధాలా అన్యాయం జరిగిందన్నారు.



డిప్యూటీసీఎంను సన్మానిస్తున్న పాలకులు

- జిల్లా ఇన్‌చార్జి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ... గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో గిరిజన నియోజవర్గాల ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికు అండగా నిలుస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తుండడం సంతోషదాయకమన్నారు.
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రాష్ట్రస్థాయి కార్యక్రమం నూతనంగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఏ ఎన్నికల్లోనైనా, ఎప్పుడైనా గిరిజన నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తున్న గిరిజనులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్వతీపురంను పార్వతీపురం మన్యంగా, అరకును అల్లూరి సీతారామరాజు జిల్లాలుగా నామకరణం చేసి మన్యం ప్రాంతానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపు ఇచ్చారన్నారు. ఇటీవల కురుపాంలో జరిగిన జగనన్న అమ్మఒడి కార్యక్రమంలో కేజీబీవీ బాలిక అనర్గలంగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంటే ముచ్చటేసిందన్నారు. ప్రభుత్వ విద్యను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని తెలిపారు. గత టీడీపీ పాలనలో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు వెళ్లే పరిస్థితి ఉండేదని, నేడు జగనన్న పాలనలో పార్వతీపురంలో వైద్యకళాశాల, మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలతో మెరుగైన వైద్యసేవలను చేరువ చేస్తున్నారన్నారు.
- జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి మాట్లాడుతూ జీసీసీ ఉత్పత్తులను తిరుపతిలోని వేంకటేశ్వరస్వామి పూజలు, అభిషేకాలకు వినియోగిస్తున్నట్టు వెల్లడించారు. ఇది ఆదివాసీల ఘనతగా పేర్కొన్నారు. ఎంపీపీ బద్నాన ప్రమీల మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనులకు న్యాయం, మేలు జరుగుతోందన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో గిరిజనురాలునైన నేను ఎంపీపీ అయినట్టు తెలిపారు.
- గిరిజనసంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే, రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖ సంచాలకులు జె.మురళి, ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు, ఎమ్మెల్సీ పి.రఘువర్మ తదితరులు మాట్లాడుతూ, గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు గిరిజనులను పాలకులు సత్కరించారు. కార్యక్రమంలో జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

అలరించి.. మురిపించి..

ఆదివాసీ ఉత్సవంలో ప్రదర్శించిన పాడేరు గిరిజనుల థింసా నృత్యం, రంపచోడవరం కొమ్ముడాన్స్, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం కళాకారుల సవరడ్యాన్స్, సాలూరు బిందెల డ్యాన్స్‌లు చూపరులను అలరించాయి.

ఆకట్టుకున్న స్టాల్స్

ఉత్సవాల్లో భాగంగా ఇంజినీరింగ్, జీసీసీ, ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ, హౌసింగ్, ఐసీడీఎస్, గిరివెలుగు, వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు సందర్శించారు. జీసీసీ స్టాల్‌లో అటవీఫలాల రుచిచూశారు. అరకు కాఫీని ఆస్వాదించారు. చివరిగా సుమారు 70 కోట్ల రూపాయలు విలువ చేసే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.



గిరిజన బాలికల థింసా నృత్యం



కొమ్ము డ్యాన్స్

కలెక్టరేట్‌లో...

విజయనగరం అర్బన్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయనగరం కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అడవితల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్, ఎమ్మెల్యే శంబంగి చిన అప్పలనాయుడు, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసీల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. అనంతరం గిరిజన విద్యార్థులు నృత్యప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమాధికారి చంద్రశేఖర్, డీఎస్పీ ఎల్.శేషాద్రి, గిరిజన జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మి అప్పలరాజుదొర, గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆర్ఎస్ వరహాల దొర, గిరిజన సంఘం నాయకులు ముప్వల అమర్‌నాథ్, వలువురు జిల్లా అధికారులు, గిరిజన సంక్షమశాఖ సిబ్బంది, వసతిగృహాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గిరిజన బాలికల జానపద నృత్యప్రదర్శన

నాడు నిషేధించిన సీబీఐతో నేడు విచారణా!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి:

పుంగనూరు ఘటనలో సీబీఐ విచారణ కోరుతున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సీబీఐను రాష్ట్రంలో అడుగుపెట్టనివ్వకుండా నిషేధించిన విషయం రాష్ట్రంలోని ప్రజలు అందరికీ ఇంకా గుర్తుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లాకు బుధవారం వచ్చిన టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై స్పందించిన ఆయన చీపురుపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీబీఐ దర్యాప్తు సంస్థపై తమకు నమ్మకం లేదని, రాష్ట్రంలో అడుగు పెట్టేందుకు అర్హత లేదని, నిషేధం జారీ చేసి ప్రజాస్వామ్య విలువలకు పాతరేసిన చంద్రబాబునాయుడు ఇప్పుడు సీబీఐ దర్యాప్తు అడగడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమం కోసం మాట్లాడాల్సిన చంద్రబాబు తనపై హత్యాప్రయత్నం అంటూ సింపతీ కోసం తాపత్రయం పడుతుండడం దారుణమన్నారు. చంద్రబాబునాయుడును రాష్ట్రంలో ఎవ్వరూ ప్రతిపక్ష నేతగా గుర్తించడం లేదని, 2019 తరువాత రాష్ట్రంలో జరిగిన ఎన్నో ఎన్నికల్లో టీడీపీ ఒక్క చోట కూడా విజయం సాధించలేదన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, ప్రజాస్వామ్యాన్ని హరించే విధంగా వ్యవహరిస్తే ఎంతటి వారిపైనైనా కేసులు నమోదు చేయడం చట్టంలో పొందుపరిచారని చెప్పారు. పుంగనూరులో చంద్రబాబునాయుడు తన అనుచరులతో మారణాయుధాలతో వెళ్లి పోలీసులపై విరుచుకుపడి విధ్వంసం సృష్టిస్తే కేసులు నమోదు చేయకుండా ఉండాలా! అని ప్రశ్నించారు. చంద్రబాబు పర్యటనకు వెళ్లినప్పుడు రోడ్ మ్యాప్‌ను పోలీసులకు ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడే శాంతిభద్రతలకు విఘాతం కల్పించడం, అల్లర్లు సృష్టించడం, తుపాకులతో పర్యటనలకు వెళ్లడం తిరిగి తనపై హత్యా ప్రయత్నం జరుగుతోందని, కేసులు పెడుతున్నారని ప్రజలను తప్పుదోవ పట్టించే మాటలు చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలకు చంద్రబాబు ఏం చేశారో చెప్పాలన్నారు. నాడు దివంగత మహానేత వైఎస్సార్ తరువాత జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో జిల్లాలో అభివృద్ధి బాటలు పడ్డాయన్నారు.

జిల్లాను అధోగతి చేయడమే నైతిక విలువలా..

అశోక్‌గజపతిరాజు నైతిక విలువలు ఉన్న వ్యక్తి అని చంద్రబాబు పొగుడుతున్నాడని జిల్లాను అధోగతి పాలు చేయడమే నైతిక విలువలా! అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రి పదవులు అలంకరించిన అశోక్ జిల్లాకు ఏం చేసారో చెప్పాలన్నారు. రాచరిక పోకడల్లోనే జీవిస్తున్న అశోక్‌కు జిల్లా ప్రజలన్నా, చివరకు ఆ పార్టీ కార్యకర్తలన్నా చిన్న చూపు అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై అశోక్‌గజపతిరాజు వాడిన భాష తీవ్ర అభ్యంతకరంగా ఉందన్నారు. గౌరవమైన ముఖ్యమంత్రిని వాడు, వీడు అంటూ తప్పుడు పదజాలం ఉపయోగించడం తప్పన్నారు. ఆయన మాటలు వెనక్కి తీసుకోకపోతే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, లెంక శ్రీరాములు, సువ్వాడ అప్పలనాయుడు, కోరుకొండ దాలయ్య ఉన్నారు.

ఐఎఫ్‌పీతో విద్యాబోధనలో నూతన ఒరవడి

- డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

రాజాం సిటీ: ప్రభుత్వ పాఠశాలలకు ఐఎఫ్‌పీ బోర్డులు అందించి విద్యాబోధనలో నూతన ఒరవడికి జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు శ్రీకారం చుట్టిందని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుపడేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఎఫ్‌ఏ-1 జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి తక్కువ మార్కులు వచ్చిన వారికి మరలా పరీక్ష నిర్వహించాలని సూచించారు. కొత్తగా ప్రవేశపెట్టిన టోఫెల్‌ను చక్కగా నిర్వహించాలని, విద్యార్థులను రెండు గ్రూపులుగా విభజించి స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.నాగయ్య, పాఠశాల స్టాఫ్ కార్యదర్శి బీవీ అచ్యుత్‌కుమార్, డీఈఓ సీసీ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవుదల కేజీబీవీ సందర్శన

రేగిడి: మండలంలోని దేవుదల కేజీబీవీను డీఈఓ లింగేశ్వరరెడ్డి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ప్రతిరోజు విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరీక్షించాలని ఎస్‌ఓ లక్ష్మికి సూచించారు. అనంతరం లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలని హెచ్‌ఎం కృష్ణారావుకు సూచించారు. లక్ష్మీపురం ఉన్నత పాఠశాల, మోడల్ ప్రాథమిక పాఠశాలలను సైతం సందర్శించారు.

1,407 జంటలకు రూ. 8.32 కోట్ల లబ్ధి

- వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా నిధులు విడుదల



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి

విజయనగరం అర్బన్: జిల్లాలో 1,407 జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కింద ఆర్థిక ప్రయోజనం కలిగినట్టు ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్‌అశోక్ తెలిపారు. 2023 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో రాష్ట్రవ్యాప్తంగా వివాహం చేసుకున్న 18,883 జంటలకు రూ.141.60 కోట్ల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి వర్చువల్‌గా బుధవారం ప్రారంభించారు. విజయనగరం కలెక్టర్ కార్యాలయం నుంచి వర్చువల్ కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే శంబంగి చిన్నప్పలనాయుడు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, జీఎస్‌డబ్ల్యూ జిల్లా కో ఆర్డినేటర్ నిర్మలాదేవి, రెడ్డిక వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ లౌతు భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ మాట్లాడుతూ జిల్లాలో 1,168 బీసీ జంటలకు, 149 ఎస్సీ, 26 ఎస్టీ, 17 దివ్యాంగ, 7 మైనారిటీ జంటలకు రూ.8.32 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారన్నారు. వైఎస్సార్ కళ్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల వల్ల చదువును మధ్యలో ఆపేసిన బాలికల సంఖ్య తగ్గుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర వర్గాల కుటుంబాల్లో వివాహ ఖర్చులకు పథకం దోహదపడుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు కళ్యాణమస్తు మెగా చెక్కును అందజేశారు.



వైఎస్సార్ కళ్యాణమస్తు చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రీ సర్వేలో సమయం వృథా చేయవద్దు

- ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్



జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: భూముల రీసర్వే ప్రక్రియలో ఒక్కరోజు కూడా వృథా కాకూడదని ఇన్‌చార్జి కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. పెండింగ్ ఎక్కువగా ఉన్నచోట రాత్రి కూడా పనిచేసి క్లియర్ చేయాలని సూచించారు. రీసర్వే ప్రక్రియలో భాగంగా మ్యుటేషన్ల కరెక్షన్, స్టోన్ ప్లాంటేషన్, తదితర అంశాలపై మండలాల వారీగా తహసీల్దార్లు, ఆర్‌డీఓలతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీఎస్, వీఆర్ఓ, తహసీల్దార్, ఆర్‌డీఓల లాగిన్‌లో మ్యుటేషన్లు ఒక్కరోజు కూడా పెండింగ్ ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. 24 గంటల్లో పరిష్కరించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అన్ని మండలాల్లో స్టోన్ ప్లాంటేషన్ ఇంకా మొదలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కేంద్రం నుంచి కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ, సర్వేశాఖ ఏ.డి త్రివిక్రమరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎరువుల అక్రమ నిల్వ పట్టివేత



లక్ష్మీపురంలో ఎరువుల నిల్వలు పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

జామి: అక్రమంగా దాచి ఉంచిన ఎరువుల నిల్వలను విజిలెన్స్, వ్యవసాయశాఖ సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. జామి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వెంకటరావు కిరాణా జనరల్స్‌లో ఎరువులను అక్రమంగా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, ఏఓ కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.42,000 విలువ కలిగిన గ్రోమోర్, డీఏపీ, యూరియా నిల్వలను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైసెన్స్ ఉన్న డీలర్లు మాత్రమే ఎరువుల క్రయవిక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. అక్రమంగా ఎరువుల అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది అజీజ్, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఆండ్ర జలాశయం నీరు విడుదల



ఆండ్ర జలాశయం నీటినీ విడుదల చేస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు,అధికారులు

బొండపల్లి/మెంటాడ: ఆండ్ర జలాశయం పరిధిలోని మెంటాడ, బొండపల్లి, గజపతినగరం మండలాల పరిధిలోని 22 గ్రామాల రైతులకు ఉపయోగపడేలా ఆండ్ర జలాశయం నుంచి నీరు విడుదల చేసినట్లు మెంటాడ ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. ఆండ్ర జలాశయం వద్ద బుధవారం లాంఛనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి కుడి,ఎడమ కాలువల ద్వారా 100 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆండ్ర జలాశయం పూర్తి నీటిమట్టం సామర్థ్యం 146 మీటర్లు కాగా ప్రసుత్తం 142.3 మీటర్లు ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎప్పుడూ రైతులకు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సారికి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లెంక రత్నాకర్, ఇరిగేషన్ డీఈఈ ఎస్.పాండు, జేఈఈలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ముద్దాయిలకు పదేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: గంజాయి కేసులో నలుగురు ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ విజయనగరం ఒకటవ ఏడీజే జడ్జి జి.రజని తీర్పు వెల్లడించారు. ఈ మేరకు ఎస్పీ ఎం.దీపిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస పోలీస్‌స్టేషన్ పరిధిలో సంతపేట వద్ద హర్యానా రాష్ట్రానికి చెందిన కొందరు వ్యక్తులు గుడారాలు వేసుకుని ఉండగా, 2016 నవంబరు 9న కొత్తవలస పోలీసులకు అందిన సమాచారంతో గుడారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హర్యానా రాష్ట్రం పానిపట్ జిల్లా స్మల్కా ప్రాంతానికి చెందిన సూరజ్ మాల్ (ఎ1), సూర్య (ఎ2), సురేష్ (ఎ3), కలియా (ఎ4)ల నుంచి 244 కిలోల గంజాయిని అప్పటి కొత్తవలస సీఐ జి.సంజీవరావు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించి, కోర్టులో అభియోగపత్రం దాఖలుచేశారు. కోర్టు విచారణలో ముద్దాయిలపై నేరారోపణలు రుజువు కావడంతో పై విధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రవి వాదనలు వినిపించారు.

అన్నదమ్ముల కొట్లాట

మెరకముడిదాం: మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య నెలకొన్న భూతగాదాలు కొట్లాటకు దారి తీశాయి. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాదిలాపు వెంకటరమణ, సత్యం అన్నదమ్ములు. వారిద్దరి మధ్య 15 ఏళ్లుగా భూమి తగాదాలు ఉన్నాయి. అయితే ఇటీవల వర్షాలు పడడంతో వారి పొలాల్లో మంగళవారం దమ్ములు పట్టే క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది, అది కాస్తా కొట్లాటకు దారితీసింది. ఈ కొట్లాటలో గాయాలపాలైన నలుగురిని చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బుదరాయవలస ఎస్సై నవీన్‌పడాల్ గ్రామానికి చేరుకుని కొట్లాటపై ఆరా తీశారు. అనంతరం పాదిలాపు వెంటకరమణ ఫిర్యాదు మేరకు పాదిలాపు సత్యంనాయుడు, పాదిలాపు చక్రధర్‌పైన, పాదిలాపుసత్యంనాయుడు ఫిర్యాదు మేరకు పాదిలాపు వెంకటరమణ, పాదిలాపు వెంకటప్పలనాయుడులపై కేసు నమోదు చేశారు.

సౌకర్యాల వెం'బడి చదువులు'

- విజయనగరం జిల్లాలో 1,578 స్కూళ్లలో నాడు నేడు పనులు
- రూ.230.99 కోట్లతో రెండో విడత
- 734 స్కూళ్లతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు
- హెచ్‌ఎంలు, పేరెంట్స్ కమిటీలకే పనుల పర్యవేక్షణ బాధ్యత



అదనపు తరగతి గదులతో రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సరిపడా లేని తరగతి గదులు, పెచ్చులూడుతున్న పైకప్పు, చెట్ల కింద చదువులు ఇదీ ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల దుస్థితి. ప్రభుత్వ పాఠశాల అంటేనే అందరూ చిన్నచూపు చేసేవారు. అయితే వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

– విజయనగరం అర్బన్



రెండో విడత నాడు నేడు నిర్మాణంలో ఉన్న మొదటి అంతస్తులోని అదనపు తరగతి గదులు



మొదటి విడత నాడు నేడు పూర్తయిన పనుల్లో భోగాపురం మండలం ముంజేరు ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సౌకర్యం

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపుదిద్దాలని మదిలో మెదిలిన ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుకు అడుగులు వేశారు. ఈ మేరకు రంగురంగుల తరగతి గదులు, స్మార్ట్‌టీవీలతో బోధన, విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్లు, ప్రహరీలు, శుద్ధజలం, గ్రీన్‌చాక్‌బోర్డు, ఇంగ్లీష్‌ల్యాబ్స్‌తో ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు కళకళలాడుతున్నాయి. మొదటి విడత మనబడి నాడు నేడు పనుల్లో చేపట్టిన మౌలిక వసతులతో సరిపెట్టకుండా రెండో విడత నాడు నేడులో అదనపు తరగతి గదులు, వంటగదులు, ప్రహరీల నిర్మాణం చేపట్టారు.

రాజాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 800మందికి పైగా విద్యార్థుల నమోదు ఉంది. గత ఏడాది వరకు తరగతి గదులు సరిపడక పాఠశాల ప్రాంగణంలో ఆరుబయట పాఠాలు వినాల్సి వచ్చేది. మన బడి నాడు నేడు రెండో విడత అభివృద్ధి పనుల్లో భాగంగా అదనపుతరగతి గదులు కావాలని ప్రతిపాదించారు. దీనికి ప్రభుత్వం స్పందించి రూ.2.5 కోట్లతో 20 అదనపు తరగతులు మంజూరు చేసింది. పాఠశాల ప్రాంగణంలో 20 గదులకు సరిపడా స్థలం లేకపోవడంతో 10 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. మరికొద్ది రోజుల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంటాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పాండ్రంగి నాగయ్య తెలిపారు.

జిల్లాలో నాడు నేడు అభివృద్ధి పనులు

మౌలిక సదుపాయాలను పెంచడమే లక్ష్యంగా రూపొందించిన మన బడి నాడు నేడు పథకం ద్వారా జిల్లాలో మొదటి, రెండు విడతల్లో రూ.414.35 కోట్లతో 1,578 స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టారు. ఇంతవరకు మొదటి నాడు నేడు పనుల్లో భాగంగా 841 స్కూళ్లకు రూ.185.02 కోట్లు మంజూరు చేసి ప్రధానమైన 9 అంశాలను కల్పిస్తూ అభివృద్ధి పనులను పూర్తి చేశారు. అలాగే గత ఏడాది 738 పాఠశాలల్లో ప్రారంభమైన రెండో విడత మన బడి నాడు నేడులో భాగంగా 3,465 అభివృద్ధి పనులు రూ.230.99 కోట్లతో మరి కొద్ది రోజుల్లో పూర్తి కానున్నాయి. రెండో విడత నాడు నేడు పనుల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, గ్రీన్‌చాక్ బోర్డు, కిచెన్ షెడ్లు ఉన్నాయి. ఫౌండేషన్ స్కూళ్లలో కలిపిన అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి వాటిలో 236 అభివృద్ధి పనుల కోసం రూ.8.03 కోట్ల నిధులు కేటాయించారు.

షెడ్యూల్ ప్రకారం రెండో విడత పనుల పూర్తి

జిల్లా వ్యాప్తంగా 738 ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన రెండో విడత నాడు – నేడు పనులను షెడ్యూల్ ప్రకారం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం. ఇందుకోసం జిల్లా స్థాయిలో అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం. నాణ్యతలో ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నాం.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ

ఐదు ఇంజినీరింగ్ విభాగాలకు నిర్మాణ బాధ్యతలు

కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలను తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన నాడు నేడు పనుల పూర్తికి ఐదు ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్లను బాధ్యులను చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ (పీఆర్), సమగ్ర శిక్ష ఇంజినీరింగ్ , పబ్లిక్, హెల్త్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ), రూరల్ వాటర్ సర్వీస్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ (ఆర్‌డబ్ల్యూఎస్) నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నాయి.

భూముల రీసర్వే వేగవంతం

- ఆర్డీఓ శేషశైలజ



చుక్కవలసలో భూముల రీసర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ శేషశైలజ

తెర్లాం: వైఎస్సార్–జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకంలో భాగంగా గ్రామాల్లో చేపడుతున్న భూముల రీసర్వేను మరింత వేగవంతం చేయాలని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ మండల, సచివాలయ సర్వేయర్లను ఆదేశించారు. ఈ మేరకు మండలంలోని చుక్కవలస గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను తహసీల్దార్ బి.రత్నకుమార్‌తో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే చాలా గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయ్యిందన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా భూముల రీసర్వే మరింత వేగంగా పూర్తయ్యేలా మండల, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓలు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూముల రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో సరిహద్దుల గుర్తింపులో భాగంగా భూములకు సంబంధించిన రైతులను తప్పనిసరిగా ఉంచాలని, వారి సమక్షంలోనే సరిహద్దుల గుర్తింపు, సర్వేరాళ్లు పాతించడం చేయాలని అన్నారు. సర్వే సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ రత్నకుమార్‌కు సూచించారు. ఆమెతోపాటు మండల సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓ గణపతి, సచివాలయం సర్వేయర్లు ఉన్నారు.

ముగిసిన ఎస్‌ఎఫ్‌ఐ సైకిల్‌యాత్ర

- నగరంలో వేలాదిమంది భారీ ప్రదర్శన



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా కేంద్రంలో జూలై 31 నుంచి ఆగస్టు 9 తేదీ వరకు ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం జరిగిన భారీ ప్రదర్శన, బహిరంగ సభతో ముగిసింది.సైకిల్ సంగ్రామ యాత్ర ముగింపు సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ నుంచి బాలాజీ జంక్షన్ మీదుగా సంగీత కళాశాల వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వరకు ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో ఎస్‌ఎఫ్‌ఐ జెండాలు చేతపట్టి వేలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. సైకిల్ యాత్ర ముందు భాగంలో నడుస్తుంటే ,వెనుక భాగంలో విద్యార్థులు ప్రదర్శనగా పాల్గొన్నారు. సైకిల్ యాత్రలో అఖిల భారత కార్యదర్శి మయుక్ బిశ్వాస్, రాష్ట్ర కార్యదర్శి అశోక్, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి రామ్మోహన్‌లు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేష్ అధ్యక్షతన జరిగిన సభలో అఖిల భారత కార్యదర్శి మాయుక్ బిశ్వాస్ మాట్లాడుతూ నేడు దేశంలో విద్యార్థులు సమస్యల ఒడిలో నలిగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం, మోదీకి పార్టనర్‌గా ఉన్న రాష్ట్రం ప్రభుత్వం ఎన్‌ఈపీ అమలు చేసి మనకు భవిష్యత్ లేకుండా చేస్తున్నాయని ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన ఉచిత విద్యా హక్కును కాలరాస్తున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు పావని, జిల్లా నాయకులు డి.రాము, హర్ష, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పరారైన రిమాండ్ ఖైదీకి జైలు శిక్ష

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్‌లో పోలీసుల కళ్లుగప్పి పరారైన రిమాండ్ ఖైదీకి జైలు శిక్షతోపాటు జరిమానాను జూనియర్ సివిల్ జడ్జి విధించారని సీఐ కె.రవికుమార్ బుధవారం తెలిపారు. ఈ ఏడాది జనవరి 12న రిమాండ్ ఖైదీ పున్నాన రాంబాబును పాలకొండ సబ్ జైలు నుంచి తీసుకువెళ్లి ఎస్.కోట కోర్టులో హాజరుపరిచి తిరిగి పాలకొండ తీసుకువస్తుండగా రాజాం బస్టాండ్‌లో ఏఆర్ పోలీసుల కళ్లు కప్పి పరారైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అప్పట్లో ఎస్సై వై.రవికిరణ్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు. ఈ మేరకు ఏపీపీ కిమిడి సూర్యకుమార్ వాదనలు వినిపించగా జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌వీటీ కృష్ణసాయితేజ ముద్దాయికి నాలుగు నెలల సాధారణ జైలు శిక్షతోపాటు రూ. 500లు జరిమానా విధించారని సీఐ వివరించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

ఘనంగా గిరిజన యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం



అతిథులను సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ 5వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దాంతో పాటు ప్రపంచ ఆదివాసీ అంతర్జాతీయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా బరంపురం ఐఐఎస్‌ఈఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ గంగూలీ హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. గిరిజన యూనివర్సిటీ ప్రపంచ స్థాయి సంస్థగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దానికి టీమ్‌వర్క్ అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన మైసూర్ ఎస్‌సీఈఆర్‌టీ రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ మురళి గాంధీ మాట్లాడుతూ కొత్త ఆవిష్కరణ గత జ్ఞాపకాల నుంచి లేదా పుస్తకాల నుండి పుట్టదని స్వేచ్ఛా మనస్సు నుంచి ఉత్సుకతతో నిండిన యువ మనస్సు నుంచి పుడుతుందని తెలిపారు. అనంతరం ప్రపంచ ఆదివాసీల అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో యూనివర్సిటీ విజయాలు, వృద్ధి ప్రయాణం గురించి వివరించారు. డాక్టర్ ఎస్.రంగనాథన్ 131వ జయంతి సందర్భంగా లైబ్రేరియన్స్ డే ఉత్సవాలలో భాగంగా డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా అతిథులను సత్కరించారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ జితేంద్ర మెహన్ మిశ్రా చైర్మన్‌గా, డాక్టర్ గంగునాయుడు ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించారు. యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల నిరసన



నిరసన దీక్షలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: క్విట్ ఇండియా డే స్ఫూర్తితో క్విట్ మోడీ..సేవ్ ఇండియా నినాదంతో కలెక్టరేట్ వద్ద ఏఐకేఎస్, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్, ఇతర సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. రైతు సంఘం కార్యదర్శి బుద్ధ రాజు రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ స్వేచ్ఛ, స్వాతంత్రం, సమానత్వం కోసం జాతీయ ఉద్యమం జరిగిందని, భారతదేశం నుండి బ్రిటిష్ వారిని తరిమికొట్టాలని నినదిస్తూ ఆగస్టు 9 ఇండియా పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఈ రోజున మోడీ, బీజేపీ పోతే తప్ప భారతదేశాన్ని, రాజ్యాంగాన్ని ,ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోలేమని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన దీక్షకు సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో కార్మిక ,రైతు సంఘాల నాయకులు కె.సురేష్, జి.శ్రీనివాస్, జి. గీత, అప్పారావు, నాగభూషణరావు,లక్ష్మి, టీవీ రమణ, జగన్మోహన్, యూఎస్ రవి, రమణ, రాకోటి రాములు, ఆదినారాయణ, చల్లా జగన్ తదితరులు పాల్గొన్నారు.

యువతిపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్



నిందితుడు సతీష్

విజయనగరం క్రైమ్: యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొడవీధికి చెందిన సతీష్ గురజాడ అప్పారావు రోడ్డులో మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న యువతిని అనుసరిస్తూ వెళ్లాడు. నిర్మానుష్య ప్రాంతంలో ఒంటరిగా వెళ్తున్న ఆ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. యువతి గట్టిగా కేకలు వేసి ప్రతిఘటించడంతో పారిపోయాడు. బాధిత యువతి పారిపోతున్న యువకుడిని అనుసరించి దిశ ఎస్‌ఓఎస్‌కి కాల్ చేసి సమాచారమందించింది. కేవలం మూడు నిమిషాల వ్యవధిలో టవర్ లొకేషన్ ఆధారంగా సంఘటనా స్థలానికి దిశ పోలీసులు చేరుకున్నారు. యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన సతీష్‌ను టవర్ లొకేషన్ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు సతీష్‌పై టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి అరెస్ట్ చేశారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన యువతిని పోలీసులు అభినందించారు.

బట్టల షోరూమ్స్‌లో చీరల దొంగతనం

- సీసీ ఫుటేజీ ఆధారంగా వెలుగులోకి



సీసీ టీవీ ఫుటేజీలో రికార్డైన మహిళలు

రాజాం సిటీ: బట్టల షోరూమ్స్‌లో కొంతమంది మహిళలు చీరలు అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజాం పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డు, పాలకొండ రోడ్డులోని షోరూమ్స్‌లో జరిగిన జరిగిన ఈ ఘటనలపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 4న కొంతమంది మహిళలు శ్రీకాకుళం రోడ్డులోని జేకే షాపింగ్‌మాల్‌లో చీరలు కొనడానికి వెళ్లి తమకు నచ్చిన చీరలను చూపించాలని కోరడంతో సిబ్బంది చూపిస్తుండగా వారి కళ్లుగప్పి 11 చీరలు అపహరించుకుపోయారు. ఈ విషయమై బుధవారం స్టాకు సరిచూసుకుంటుండగా చీరలు తక్కువ రావడంతో అనుమానం వచ్చి సీసీ ఫుటేజీని షాపింగ్ మాల్ సిబ్బంది పరిశీలించారు. సుమారు రూ. 30వేల విలువైన చీరలు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. అలాగే అదే రోజు పాలకొండ రోడ్డులోని మరో షోరూమ్‌కు వెళ్లి అక్కడ కూడా ఇదే తరహాలో 11 చీరలను మహిళలు దొంగతనం చేసి పట్టుకుపోయారు. అయితే కొంత దూరం వెళ్లాక ఒక దుకాణ యజమానికి ఫోన్ చేసి మీ షాపులో చీరలు దొంగతనం చేశామని, వాటిలో 9 చీరలు ఫలానా చోట పెట్టామని చెప్పినట్లు తెలిసింది. దీంతో ఉలిక్కిపడిన షోరూమ్ సిబ్బంది హుటాహుటిన సీసీ ఫుటేజీలను పరిశీలించి మహిళలు చీరలు దొంగతనం చేసినట్లు గుర్తించారు. మరో దుకాణంలోని 11 చీరలతోపాటు ఈ రెండు చీరలను ఆ మహిళలు పట్టుకుపోయారు. రెండో షాపులో చీరలు ఎందుకు దొంగతనం చేశారో మళ్లీ ఎందుకు దూరంగా విడిచిపెట్టారోనని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జేకే షాపింగ్‌మాల్‌లో చీరల దొంగతనంపై క్యాషియర్ పురోహిత అజిత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు.

నాణ్యతలో తేడాలోస్తే కఠిన చర్యలు

- స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి, మాలాదేవి
- పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో భోజనాల పరిశీలన



రామభద్రపురం అంగన్‌వాడీ–3కేంద్రంలో చిన్నారులకు వండిన భోజనం రుచి చూస్తున్న స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలలో విద్యార్థులు, చిన్నారులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాల నాణ్యతలో తేడాలొస్తే కఠిన చర్యలు తప్పవని స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు జి.లక్ష్మీరెడ్డి, జి.మాలాదేవి హెచ్చరించారు. ఈ మేరకు రామభద్రపురం మండల కేంద్రంలోని రేషన్ డిపోలు, ఇంటింటికీ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాలను పరిశీలించారు.స్థానిక కూరాకుల వీధిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న రేషన్ సక్రమంగా అందుతోందా? లేదా? అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని సక్రమంగా అందుతున్నాయి, గతం కంటే ఇంటి వద్దకే రేషన్ సరుకులు తెచ్చి ఇవ్వడం సంతోషంగా ఉందని ప్రజలు చెప్పడంతో సంతృప్తివ్యక్తం చేశారు. అలాగే కనిమెరక వీధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు–2,3, ఎగువహరిజన వీధిలోని ప్రాథమిక పాఠశాల, స్థానిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న సరుకుల రికార్డులు పరిశీలించారు. పిల్లలకు వండిన వంటలు రుచి చూసి సంతృప్తి చెందారు.

హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్‌కు సిఫారసు

ఉన్నత పాఠశాలలో బియ్యం, గుడ్లు స్టాకు పరిశీలించి వ్యత్యాసాలను గుర్తించారు. వెంటనే సంబంధిత హెచ్‌ఎం కామేశ్వరరావుకు షో కాజ్ నోటీస్ ఇవ్వాలని డిప్యూటీ డీఈవో బ్రహ్మాజీరావుకు సిఫారసు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల ఆరోగ్యపరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. రూ.కోట్లాది రూపాయలు వెచ్చించి విద్యార్థులకు పోషకాహారం అందించాలన్న ధ్యేయంతో ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంటే హెచ్‌ఎంలు నిర్లక్ష్యంగా వహించడం సమర్థనీయం కాదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో బ్రహ్మాజీరావు, ఎంఈవో–2 పెంటయ్య, సీడీపీవోలు పాల్గొన్నారు.